## క్లుప్తంగా

### యువతి వివాహానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న డాక్టర్ రామిరెడ్డి

కోవెలకుంట్ల: స్థానిక ఎల్‌ఎం కాంపౌండ్‌కు చెందిన కుమార్ కుమార్తె శ్రావణి వివాహానికి పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామిరెడ్డి గురువారం చేయూతనిచ్చారు. ఆ యువతి వివాహానికి తన వంతు సాయంగా రూ. 5 వేలు అందజేశా రు. కార్యక్రమంలో రామిరెడ్డిసేవా సమితి సభ్యులు సుబ్రహ్మణ్యం,సరోజ తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత నర్సింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో ఏపీ స్కిల్ డెవలెప్‌మెంట్ ఆధ్వర్యంలో డాక్టర్ రెడ్డిస్ ఫౌండేషన్ సహకారంతో రెండు నెలల పాటు ఇచ్చే ఉచిత జనరల్ డ్యూటీ నర్సింగ్ సహాయకుల శిక్షణకు యువతులు దరఖాస్తు చేసుకోవాలని సెంటర్ కోఆర్డినేటర్ బంగి శిరీష బుధవారం తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాలలోపు యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తైన తర్వాత ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు.

### బిజ్జం సత్యంరెడ్డి వర్ధంతి



బిజ్జం సత్యంరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోవెలకుంట్ల: వైఎస్సార్‌సీపీ నేత, పాణ్యం మాజీ ఎమ్మెల్యే బిజ్జం పార్థసారథిరెడ్డి తండ్రి బిజ్జం సత్యంరెడ్డి 23వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. స్థానిక బిజ్జం కార్యాలయంలో ఆ పార్టీ నాయకుడు మారం భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాట్ల వెంకటేశ్వరరెడ్డి, పోతం రాంమోహన్‌రెడ్డి, అమడాల భాస్కర్‌రెడ్డి, నాగభూషణంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రవీంద్రనాథరెడ్డి, రాంభూపాల్, గుర్రప్ప, వెంకటేశ్వర్లు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి శతాబ్ది వేడుకలు

కొలిమిగుండ్ల: తిమ్మనాయినపేటలోని వాసవీ కన్యాకపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం నుంచి శత సంవత్సర కుంభాభిషేక వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం నాయకులు తెలిపారు. 23 వతేదీ వరకు మూడు రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. అమ్మవారి ఆలయం నిర్మించి వందేళ్లు పూర్తి కానుండడంతో గాలిగోపురం, కలశ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు చేపట్టామన్నారు.

### మజ్జిగ పంపిణీ

డోన్ టౌన్: పట్టణంలోని పాతబస్టాండ్‌లో గురువారం స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో సభ్యులు ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. కర్నూలుకు చెందిన సాయిబాబ భక్తురాలు డాక్టర్ శ్రీలక్ష్మి ఆర్థిక సాయంతో మజ్జిగ పంపిణీ చేసినట్లు స్ఫూర్తి సభ్యుడు మధు తెలిపారు.

### ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రం

డోన్ టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, ప్రజలు ఐకమత్యంగా గుణపాఠం చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు ఆరోపించారు. దేశ్‌కి బచావో మోడీకి హటావో నినాదంతో వామపక్షాల ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార భేరి కార్యక్రమం గురువారం పట్టణంలో కొనసాగించారు. శ్రీరాంనగర్, వైయస్ నగర్‌లలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరవ్‌మోడీ, లలిత్‌మోడీ తదితర బడాబాబులకు ప్రధాని మోడీ వత్తాసు పలుకుతున్నారన్నారు. ప్రభుత్వ రంగాలను నిర్వీర్యం చేస్తున్నారని, ప్రైవేట్ వశం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు.

### పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



కార్మికులకు దుస్తులను పంపిణీ చేస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: మండలంలోని పలుకూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం 25 మంది పారిశుద్ధ్య కార్మికులకు సర్పంచ్ కోనేటి సుమలత, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి దుస్తులను పంపిణీ చేశారు. కరోనా కష్టకాలంలో పారిశుద్ధ్య కార్మికుల అంకితభావ సేవలను ఈ సందర్భంగా గుండం శేషిరెడ్డి గుర్తు చేశారు. కార్మికులకు తమవంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసులు, సచివాలయ కన్వీనర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.







పూర్తయిన సీసీ రోడ్డు

## తుమ్మల పెంట..అభివృద్ధి బాట!

కొలిమిగుండ్ల: అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న మండల పరిధిలోని తుమ్మలపెంట గ్రామం అభివృద్ధి బాట పట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామంలో అభివద్ధి పరుగులు పెడుతోంది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సహకారంతో ఏళ్లతరబడి నెలకొన్న సమస్యలకు పరిష్కారం లభించింది. రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం,రూ.17.50 లక్షలతో విలేజ్ హెల్త్ క్లీనిక్ మంజూరు కావడంతో శరవేగంగా నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులో తీసుకొచ్చారు. రూ.30 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్లు గతంలోనే ప్రారంభించగా ప్రస్తుతం రూ.60 లక్షలకు పైగానే వ్యయంతో పలు కాలనీల్లో సీసీ రోడ్లతో పాటు వెయ్యి మీటర్ల పొడవున డ్రైనేజీలు ఏర్పాటు చేయడంతో పారిశుద్ధ్య సమస్య మాయమైంది. వేసవి వస్తే మంచినీటి ఎద్దడి తీవ్రంగా ఉండేది. రూ.28 లక్షలతో కొత్తగా పైపులైన్ నిర్మాణం, విద్యుత్ ట్రాన్స్‌ఫారం, విద్యుత్ లైన్ ఏర్పాటు చేసి నీటి సమస్యకు చెక్‌పెట్టారు. ఎస్సీ కాలనీలో రూ.6లక్షలతో 42 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. గ్రామానికి సమీపంలోనే జగనన్న కాలనీలో 133 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో కాలనీలో గృహ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. రూ.20 లక్షలతో విశాలమైన గ్రావెల్ రోడ్లు వేశారు. కాలనీల్లో విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించారు.

## కేసీ ద్వారా 1.37 లక్షల ఎకరాలకు సాగునీరు

- కేసీ కెనాల్ ఈఈ తిరుమలేశ్వరరెడ్డి

నంద్యాల(అర్బన్): రబీలో కేసీ కెనాల్ ద్వారా 1.37 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని కేసీ కెనాల్ ఈఈ తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. కర్నూలు, కడప, నంద్యాల జిల్లాల్లో కేసీ కెనాల్‌కు సంబంధించి 90,500ఎకరాల ఆయకట్టు ఉండగా ఈనెల 15వరకు 1.37లక్షల ఎకరాలకు సాగునీరు అందించి పంటల సాగుకు తోడ్పాటునిచ్చామన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో వరి దిగుబడులు, ధరలు ఆశాజనకంగా ఉండటంతో రబీలో సైతం వరిసాగైందన్నారు. ఇప్పటికే తాగునీటి కుంటలను సైతం నింపామని, దాదాపు 0.78 టీఎంసీలు సుంకుసుల బ్యారేజీలో తాగునీటి అవసరాల నిమిత్తం నిల్వ ఉంచామని చెప్పారు. ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు అలగనూరు ఫీడర్ చానెల్ ద్వారా కుందూనదికి నీటిని వదిలామని చెప్పారు.

## మట్కా నిర్వాహకులపై దాడులు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శేషయ్య

డోన్ టౌన్: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మట్కా నిర్వాహకులపై తనతోపాటు ఎస్‌ఐలు శరత్ కుమార్ రెడ్డి,నగేష్ మూడు బృందాలుగా ఏర్పడి విస్తృతంగా దాడులు చేపట్టామని పట్టణ సీఐ శేషయ్య తెలిపారు. పట్టణ పోలీసు స్టేషన్‌లో గురువారం సాయిత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దాడులకు సంబంధించిన విరాలను సీఐ వెల్లడించారు. పాతపేటకు చెందిన కటికె రమణ, ఉల్లిగడ్డల ప్రసాద్, దూదేకుల లాల్‌బాషా, దూదేకుల మహబూబ్‌బాషా, బోయ రంగస్వామి, కొండపేటకు చెందిన షేక్ మహ్మద్ అలియాస్ మైబు, చల్లా మధుమోహన్, ఒట్టెందు బండి వెంకటేశ్వర్లు, బోయ బాలు, చిగురమాను పేటకు చెందిన రామాంజనేయులు, టీఆర్ నగర్ దూదేకుల రహంతుల్లా, ఇందిరానగర్‌కు చెందిన టమటం ఈడిగ మనోహర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరి నుంచి రూ.2.40లక్షలతో పాటు 80లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఆయన తెలిపారు.

## అంటు వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

డోన్ టౌన్: అంటు వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ టీం అధికారి రామకృష్ణ అన్నారు. ప్రపంచ మలేరియ దినోత్సవం పురస్కరించుకుని గురువారం కొత్తపేట జెడ్పీ హైస్కూల్‌ల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మలేరియ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం విద్యార్థులు మలేరియ నివారణపై వ్యాస రచన,వకృత్వ పోటీలు నిర్వహించారు. అఖిల ప్రియ, భవితశ్రీ, మధుమేఘన ప్రథమ స్థానాల్లో నిలువగా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ హేమలత, ఏఎస్ఎం హేమలత తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డిపో మేనేజర్ రవికిశోర్

బనగానపల్లెరూరల్: ప్రతి ఒక్కరూ అగ్ని ప్రమాదలపై అప్రమత్తంగా ఉండాలని, ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటించాలని బనగానపల్లె ఆర్టీసీ డిపో మేనేజర్ రవికిశోర్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలు గురువారం ముగిశాయి. ఈమేరకు స్థానిక అగ్నిమాపకశాఖ కార్యాలయంలో ఫైర్ ఆఫీసర్ నరసింహులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి డీఎం హాజరయ్యారు. అగ్నిప్రమాదాల నుంచి ప్రజలను రక్షించేందుకు ఆ శాఖ ఉద్యోగులు చేస్తున్న కృషిని డీఎం అభినందించారు. ఈ సందర్భంగా గ్యాస్ సిలిండర్ లీకేజీ సమయంలో మంటలు ఏలా ఆర్పివేయాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను అగ్నిమాపక పరికరాల ప్రదర్శన ద్వారా ఫైర్ ఆఫీసర్ నరసింహాలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది శివశంకర్‌రెడ్డి, శ్రీనివాసులు, కాశీశ్వరుడు, ఎస్ హాజీబాషా, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### అత్తపై హత్యాయత్నం

సంజామల(కోవెలకుంట్ల): సంజామల మండలం అల్వకొండ గ్రామంలో అత్తపై అల్లుడు దాడి చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రతాప్ అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన దానమ్మ తనకుమార్తె దీప్తిని గోస్పాడు మండలం నాగులవరం గ్రామానికి చెందిన హేమంత్ అనే వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపించింది. ఇటీవల జరిగిన ఈస్టర్‌పండుగకు కుమార్తెను పుట్టింటికి పిలుచుకుని వెళ్లింది. పది రోజులు దాటినా తిరిగి పంపక పోవడంతో పిలుచుకువెళ్లేందుకు అల్లుడు వచ్చాడు. ఈ క్రమంలో అత్త, అల్లుడి మధ్య వాగ్వాదం చోటు చేసుకుని పక్కనే ఉన్న రోకలిబండతో అత్త తలపై బలంగా కొట్టాడు. తీవ్రంగా గాయపడిన దానమ్మను చికిత్స నిమిత్తం నంద్యాల ఆసుపత్రిలో చేర్పించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుమార్తె ఫిర్యాదు మేరకు హేమంత్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

### ఇరువురి మధ్య ఘర్షణ

కోవెలకుంట్ల: మండలంలోని గుళ్లదూర్తి గ్రామంలో గురువారం ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటరెడ్డి అందించిన సమాచారం మేరకు.. వైఎస్సార్ జిల్లా రాయచోటికి చెందిన కొందరు వ్యక్తులు కడ్డీల మంచాలు అల్లుతూ ఊరూరు తిరుగుతున్నారు. వారం రోజుల క్రితం గుళ్లదూర్తికి చేరుకున్నారు. మంచాలు అల్లిన తర్వాత గురువారం సాయంత్రం మద్యం సేవిస్తున్న సమయంలో వెంకటయ్య, ఆంజనేయులు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఆంజనేయులు పక్కనే ఉన్న కట్టెతో వెంకటయ్యపై దాడి చేసి గాయపరిచాడు. చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

### పేకాటరాయుళ్ల అరెస్ట్

సంజామల(కోవెలకుంట్ల): సంజామల మండలం మిక్కినేనిపల్లె గ్రామ శివారులో గురువారం పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ ప్రతాప్ అందించిన సమాచారం మేరకు.. వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్లకు చెందిన ఆరుగురు, సంజామల మండలం గిద్దలూరుకు చెందిన ఇద్దరు వ్యక్తులు ముళ్లపొదల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు దాడి నిర్వహించి వారి వద్ద నుంచి రూ. 33,500 నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

## ముస్లింలకు ఇఫ్తార్ విందు

అవుకు: ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అవుకు పట్టణ ముస్లిలకు గురువారం రాత్రి జామియా మీదులో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే వ్యక్తిగత కారణాలతో రాలేకపోవడంతో అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి పాల్గొని ముస్లింలకు విందు వడ్డించారు. వారితో కలిసి విందు స్వీకరించారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలతో పాటు మెట్టుపల్లె ఉపసర్పంచ్ వెంకటేశ్వర రెడ్డి, కాంట్రాక్టర్ మద్దయ్య, సచివాలయ కన్వీనర్ సుబ్రహ్మణ్యం, చౌడయ్య తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని చిన్నకొప్పెర్ల గ్రామంలో గురువారం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్‌విందు ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జయభారత్‌రెడ్డి, జగదీష్ రెడ్డి, ప్రసాదరెడ్డి, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలోని నూరాన్ మసీదులో గురువారం రాత్రి వైఎస్సార్‌సీపీ నాయకుడు, వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడు ఉలవల నరసింహుడు ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు వెంకటేష్,శ్రీను,వెంకటేష్,సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

### పండ్లు పంపిణీ

ప్యాపిలి: స్థానిక జామియా మసీదులో ముస్లింలకు ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌నాయక్, నాయకులు చిన్నపరెడ్డి, సురేశ్‌బాబు, చంద్రమౌళి, ఇక్బాల్ హుసేన్, హాజీ మస్తాన్ వలి, టీవీ రమేష్, కిరణ్ కుమార్, విజయ్ కుమార్ రెడ్డి, శివ, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్న కాటసాని తిరుపాల్ రెడ్డి

### నేడు ఇఫ్తార్ విందు

డోన్ టౌన్: ముస్లిం సోదరులకు శుక్రవారం పట్టణంలోని షాదిఖానాలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు పట్టణ సీఐ శేషయ్య గురువారం తెలిపారు. ముస్లింలకు ఎంతో పవిత్రమైన రంజాన్ మాసం చివరి రోజును పురస్కరించుకుని పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఈ విందు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

### మండలానికి రెండు ఆధార్ సెంటర్లు

అవుకు: మండలానికి మరో రెండు ఆధార్ సెంటర్లు మంజూరు అయ్యాయని ఎంపీడీఓ అజాంఖాన్ గురువారం తెలిపారు. ఇప్పటి వరకు శింగనపల్లె గ్రామ సచివాలయంలో ఆధార్ సెంటర్ ఉండేదని, అక్కడి డిజిటల్ అసిస్టెంట్ ద్వారానే మండల పరిధిలోని గ్రామాలలో ఆధార్ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. త్వరలోనే రామాపురం-1,గుండ్లశింగవరం గ్రామ సచివాలయానికి ఆధార్ సెంటర్లు మంజూరు అయ్యాయని, త్వరలోనే సేవలు ప్రారంభమవుతాయని ఎంపీడీఓ తెలిపారు.

### అన్నదానం

డోన్ టౌన్: పట్టణ పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం అంబేడ్కర్ సేవా సమితి సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు మేకల శివానంద్,వర్కింగ్ ప్రెసిడెంట్ జీవన్,కోశాధికారి రాజు, ఎంఈఎఫ్ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మోటా రాముడు తదితరులు పాల్గొన్నారు.

### వ్యాసరచన పోటీలు

బేతంచెర్ల: పట్టణంలోని కస్తూర్బా గురుకుల విద్యాలయంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం విద్యార్థినులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. మలేరియా రావడానికి గల కారణాలు, నిర్మూలన అంశాలపై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థినులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఆరోగ్యంగా ఉండాలంటే వ్యకిగత శుభ్రత పాటించాలని ఈ సందర్భంగా మలేరియా సబ్‌యూనిట్ అధికారి రామకృష్ణయ్య, హెల్త్ అసిస్టెంట్ రామాంజనేయులు విద్యార్థినులకు సూచించారు.

### పాడి రైతులకు అందుబాటులో ఉండండి

అవుకు:మండల పరిధిలోని పాడిరైతులకు ఏహెచ్‌ఏలు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని పశువైద్యాధికారిణి భారతీదేవి సూచించారు. గురువారం అవుకు మండలం కునుకుంట్ల గ్రామంలోని రైతుభరోసా కేంద్రాన్ని ఆమె తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని పాడిరైతులతో ఆమె మాట్లాడి మూగజీవాల సమస్యలను తెలుసుకుని సూచనలు చేశారు. వేసవి నేపథ్యంలో మూగజీవాల పట్ల పెంపకదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే వాటిని ఎక్కువ శాతం పాకలలో ఉంచి, నీటిని అందుబాటులో ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో ఏహెచ్‌ఏ భార్గవి, పాడిరైతులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా ప్రభుత్వం



సబ్సిడీపై టార్పానిన్లను రైతులకు అందజేస్తున్న రాజశేఖర్‌రెడ్డి

డోన్ టౌన్: రైతులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉందని, వారి అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. మండలంలోని తిరునాంపల్లె గ్రామంలో గురువారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సబ్సిడీ వ్యవసాయ పనిముట్లను ఆయన రైతులకు పంపిణీ చేశారు. వ్యవసాయశాఖ ఏడీ అశోకవర్ధన్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ షఫీ, ఉద్యానవన శాఖ అధికారిని కళ్యాణి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సబ్సిడీ వివరాలు రైతులకు వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం యాభై శాతం సబ్సిడీపై అందించే వ్యవసాయ పనిముట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చంద్రన్న, జెడ్పీటీసీ సభ్యుడు రాజ్‌కుమార్, సింగిల్ విండో చైర్మెన్ తిరుమలరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు గిద్దారెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారులు చంద్రశేఖర్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

### వాటర్ డిస్పెన్సరీ విరాళం



మసీదుకు వాటర్ డిస్పెన్సరీ అందజేసిన దృశ్యం

ప్యాపిలి: స్థానిక జామియా మసీదుకు కర్నూలుకు చెందిన సుధా గురువారం వాటర్ డిస్పెన్సరీని విరాళంగా అందజేశారు. వేడి నీటితో పాటు చల్ల నీరు వేర్వేరుగా వచ్చే ఈ డిస్పెన్సరీ ద్వారా మసీదుకు వచ్చే ముస్లిం సోదరులకు ఉపయోగకరంగా ఉంటుందని ఆమె అన్నారు. కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు గౌసియా బేగం, సుజాత, విజయలక్ష్మి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు సంతృప్తి చెందే స్థాయిలో పథకాలు అందాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జేసీ, ఇతర అధికారులు

నంద్యాల: సంక్షేమ పథకాలు ప్రజలు సంతృప్తి చెందే స్థాయిలో అందించేందుకు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి కలెక్టర్లకు సూచించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి రీసర్వే, జాతీయ రహదారుల కోసం భూ సేకరణ, హౌసింగ్, రెవెన్యూ, వ్యవసాయ అనుబంధ రంగాలు, పీఆర్ అండ్ ఆర్‌డీ, వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ చాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌తో పాటు జాయింట్ కలెక్టర్ నిశాంతి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. సీఎస్ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలన్నారు. ఉపాధి కూలీలకు సకాలంలో బిల్లులు అందేలా, సచివాలయ బిల్డింగ్‌లు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చే యాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన గ్రీవెన్స్‌తో పాటు పథకాలు ప్రజలు సంతృప్తి చెందే స్థాయిలో అమలు చేయాలని చెప్పారు. స్పందన ఫిర్యాదుల పరిష్కారంలో ప్రజల అసంతృప్తికి గల కారణాలను అన్వేషించి సరైన రీతిలో పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ కామేశ్వరరావు పాల్గొన్నారు.

### రైతు భరోసా కేంద్రం తనిఖీ



వివరాలు సేకరిస్తున్న వెంకటేశ్వర రెడ్డి

ప్యాపిలి: స్థానిక రైతు భరోసా కేంద్రాలను వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి తనిఖీ చేశారు. ఆర్బీకేల్లో రైతులకు ఇబ్బంది లేకుండా విధులు నిర్వర్తించాలని ఆయన ఆర్బీకే సిబ్బందికి సూచించారు. ఖరీఫ్ ప్రారంభమయ్యేలోగా రైతులు తమ పొలాల్లోని మట్టిని భూసార పరీక్షలకు పంపేవిధంగా సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు.

### బీజేపీని గద్దె దింపుదాం

బేతంచెర్ల: వచ్చే ఎన్నికల్లో బీజేపీని గద్దెదింపి దేశాన్ని కాపాడుకుందామని సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు ఎల్లయ్య, పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య అన్నారు. గురువారం పట్టణంలోని డోన్ క్రాస్ రోడ్డులోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి ప్రచారభేరి పాదయాత్రను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయా కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు.





## ఈత.. భలే సరదా!

ఎండలు మండుతున్నాయి. ఉదయం 10 గంటల నుంచే భానుడు తనప్రతాపాన్ని చూపుతున్నాడు. దీంతో ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. శీతల పాణియాలు సేవిస్తూ ఉపశమనం పొందుతున్నారు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో యువత బావులను ఆశ్రయిస్తున్నారు. ఈత కొడుతూ సేద తీరుతున్నారు. హాయిగా...సరదాగా గడపుతున్నారు. బావుల్లో నీరు నిండుగా ఉండడంతో కేరింతలు కొడుతున్నారు. - బేతంచెర్ల